క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో స్వాతి వేడుకలు


శ్రీ గణ మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని తెలుగుపేటలో వెలసిన శ్రీ గణ మద్దిలేటి లక్ష్మీ నృసింహా స్వామి దేవస్థానంలో శ్రావణ శుక్రవారం స్వామివారి జన్మ నక్షత్రం స్వాతిని పురస్కరించుకొని వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం పంచామృత అభిషేకం, స్నాపన తిరుమంజన సేవా నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శనం భాగ్యం కల్పించారు. అనంతరం మహాలక్ష్మి అమ్మవారికి సామూహిక కుంకుమార్చన చేశారు. అనంతరం మహామంగళ హారతులిచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకుడు మధుసూదన్ నారాయణ, అర్చకుడు శ్రీరామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరనలో అమ్మవారు


కాళికాంబదేవి

నంద్యాల(వ్యవసాయం): శ్రావణ మాసం రెండో శుక్రవారాన్ని పురస్కరించుకుని స్థానిక కాళికాంబాదేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి తెల్లవారుజామునే పంచామృతాభిషేకాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం శ్రీకాళీ మాత సేవా సమాజ్ ఆధ్వర్యంలో పల్లకీ సేవ నిర్వహించి అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆరవేటి వాసు, ఈఓ లక్ష్మీనారాయణ, అర్చకులు రాఘవేంద్ర, సుబ్బాచారి, విజయ్‌కుమార్, లక్ష్మీదేవి, నరసింహ, తదితరులు పాల్గొన్నారు. గోమాతకు ఒడి బియ్యం పోసి మహా మంగళ హారతులు ఇచ్చారు.

దాడి చేయటం టీడీపీ నాయకులకు అలవాటైపోయింది

నంద్యాల(అర్బన్): కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి టీడీపీ నాయకులు చెలరేగిపోతున్నారని, వారికి ప్రభుత్వ ఉద్యోగులపై చేయి చేసుకోవడం అలవాటై పోయిందని కాంగ్రెస్ పార్టీ నంద్యాల పట్టణ అధ్యక్షుడు చింతలయ్య అన్నారు. విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌పై మంత్రి బంధువు చెంప చెళ్లుమనిపించడం దారుణమని, దీనిపై జిల్లా ఎస్పీ వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. కానిస్టేబుల్‌ను కొట్టిన వారు ఎంతటి పదవుల్లో ఉన్నా అరెస్ట్ చేయాలని చెప్పారు.

ధోబీఘాట్ల అభివృద్ధికి చర్యలు


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సావిత్రి

నంద్యాల(అర్బన్): జిల్లాలో రజకుల కోసం పాత ధోబీ ఘాట్లను గుర్తించి వాటిని ఆధునికంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి అన్నారు. మోడరన్ ధోబీఘాట్ల ఏర్పాటుకు నిధులను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు వెల్లడించారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ ధోబీఘాట్లు లేని గ్రామాలను గుర్తించి రజకులు సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. రజకుల స్థితి గతుల మార్పునకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, ఈ అవకాశాన్ని రజకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సీడ్స్ మద్దిలేటి, నాగరాజు, కుసుమాంబ, రంగయ్య, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న నాయకులు

నంద్యాల(న్యూటౌన్): ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అనుబంధం మూడో రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ యూనియన్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసులు, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేదవతి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈనెల 30, 31 తేదీల్లో కడపలో మహాసభలు జరుగుతాయన్నారు. ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన పోరాటాలపై భవిష్యత్తు కార్యాచరణ చేస్తారన్నారు. మహాసభలకు జిల్లా నుంచి ఆశా కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు. సమావేశంలో మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షురాలు సుశీలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మినుము..నష్టాలే మిగులు!

- భారీగా తగ్గిన దిగుబడులు
- పెట్టుబడులు కూడా రాని పరిస్థితి
- ఆందోళనలో రైతులు


పేరూరు-ఎర్రగుడిదిన్నె మధ్య రోడ్డుపై ఆరబోసిన మినుములు


పేరూరు వద్ద మినుము కోత కోస్తున్న యంత్రం

రుద్రవరం: కూటమి సర్కారు పాలనలో వ్యవసాయానికి భరోసా లేక రైతుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఓ వైపు ప్రకృతి సహకరించక.. మరో వైపు ప్రభుత్వం ఆదుకోక కష్టాల సాగులో నష్టాల పాలయ్యారు. గతేడాది మినుము ఆశించిన స్థాయిలో దిగుడులు రాక, మద్దతు ధర లభించక నష్టాలు చవిచూసిన రైతులు ఆ నష్టాన్ని పూడ్చుకునేందుకు ఈ ఏడాది ముందస్తు వర్షాలకు పంట సాగు చేశారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని రుద్రవరం, దొర్నిపాడు, చాగలమర్రి మండలాల్లోనే 5 వేల హెక్టార్లకు పైగా మినుము పంట వేశారు. సేద్యం, విత్తనాలు, కూలీలు తదితర వాటికి ఎకరాకు పెట్టుబడి రూ. 18 వేల నుంచి రూ. 22 వేల వరకు వెచ్చించారు. ముందు ఊరించిన వర్షాలు ఆ తర్వాత ముఖం చాటేయడంతో పంటలు వాడు ముఖం పట్టాయి. కాపాడుకునేందుకు రైతులు అష్ట కష్టాలు పడ్డారు. చుట్టు పక్కల పొలాల్లో ఉన్న బోర్లు, వాగులు, వంకల్లో నిల్వ ఉన్న నీటిని ట్రాక్టర్లు, ఆయిల్ ఇంజన్ల ద్వారా పంటకు పారించుకున్నారు.అయినా, ఆశించిన ఫలితం లేదు. ప్రస్తుతం పంట కోతలు జరుగుతున్నాయి. ఎకరానికి 2 క్వింటాళ్లు మాత్రమే దిగుబడులు వస్తున్నాయి. వాటిని వ్యాపారులు క్వింటా రూ.6,200 ప్రకారం కొనుగోలు చేస్తున్నారు. ఎకరానికి పెట్టుబడుల కింద రూ.22 వేల వరకు ఖర్చు చేస్తే చేతికి రూ.12 వేలే వస్తుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఈసారి కూడా తమకు నిరాశే మిగిలిందని వాపోతున్నారు.

రూ.2 లక్షలు పెట్టుబడి పెడితే రూ. 36వేలు వచ్చాయి



నేను ఎకరా రూ.30 వేల ప్రకారం నాలుగెకరాలకు రూ.1,20,000 చెల్లించి కౌలుకు తీసుకొని మినుము సాగు చేశాను. పెట్టుబడులు ఎకరానికి రూ.20 వేల చొప్పున రూ.80 వేలు పెట్టాను. ముందుస్తు వానలకు కలిసి వస్తుందనుకున్నా. వానలు లేకపోవడంతో పంట ఎదుగుదల లోపించి దిగబడులు పూర్తిగా తగ్గాయి. పంట కోత కోయగా కేవలం 6 క్వింటాళ్లు దిగుబడి వచ్చింది. దీనిని అమ్మితే రూ.36 వేలు చేతికి వచ్చాయి. గతేడాది నుంచి వ్యవసాయం కలిసి రావడం లేదు. ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందడం లేదు. పండించిన పంటకు మద్దతు ధర కూడా లభించడం లేదు.

–ఆరోగ్యం, రైతు,పేరూరు

అహోబిలేశుడిని దర్శించుకున్న గంగుల


దేవాలయంలో మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: శ్రీ అహోబిల లక్ష్మీ నరసింహస్వామి వార్లను మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. అహోబిలం చేరుకున్న ఆయనకు ఆలయ మర్యాదల్లో భాగంగా అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎగువ, దిగువ అహోబిలం క్షేత్రాల్లోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి సుదర్శన హోమంలో పాల్గొన్నారు. అనంతరం అర్చకులు స్వామివార్ల శేషవస్త్రం, ప్రసాదాలు అందజేసి వేదాశ్వీచనాలు అందించారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మెంబర్ పద్మావతి



సమావేశంలో మాట్లాడుతున్న పద్మావతి

నంద్యాల: బాల బాలికల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని వారి సంరక్షణకు ప్రభుత్వ సంస్థలు, ప్రైవేట్ సంస్థలు కృషి చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో బాలల సమస్యలు, విద్యా హక్కు చట్టం 2009, బాలల న్యాయ చట్టం 2015, పోక్సో చట్టం 2012, బాలల హక్కుల చట్టం 2005 పై జిల్లా, మండల స్థాయి విద్యాశాఖ అధికారులు, స్త్రీ సంక్షేమ, పోలీస్ శాఖల అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ అనాథ పిల్లలు, తల్లిదండ్రులు చనిపోయిన పిల్లల పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వారికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. పోక్సో బాధితులకు హాస్పిటల్లో ప్రత్యేక గదిని ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో బాల్య వివాహాలు కట్టడి చేయాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ యుగంధర్ బాబు, డీఈఓ జనార్దన్‌రెడ్డి, ఐసీడీఎస్ పీడీ లీలావతి, సోషల్ వెల్ఫేర్ డీడీ చింతామణి, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయ, ప్రైవేట్, గవర్నమెంట్ స్కూల్ హెచ్ఎంలు, మండల విద్యాధికారులు పాల్గొన్నారు.

తల్లి పాలు బిడ్డకు సంజీవని


ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు


మాట్లాడుతున్న సీడీపీఓ చంద్రకళ

శిరివెళ్ల: పిల్లలకు తల్లి పాలు సంజీవని లాంటిదని సీడీపీఓ తేజస్విని అన్నారు. శుక్రవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లి పాల వారోత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు వీధుల్లో ర్యాలీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఏటా ఆగస్టులో 1వ తేదీ నుంచి 8వ తేదీ వరకు తల్లి పాల వారోత్సవాలు జరుగుతాయన్నారు. అంగన్‌వాడీల్లో చిన్నారులు, తల్లులు, గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. ప్రాజెక్ట్ పరిధిలో 11 ఆయా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీయిందన్నారు. త్వరలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశ్వనికుమార్ పాల్గొన్నారు.

- నంద్యాల(న్యూటౌన్): తల్లిపాలు బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందిస్తాయని నంద్యాల అర్బన్ ప్రాజెక్టు ఐసీడీఎస్ సీడీపీఓ చంద్రకళ తెలిపారు. స్థానిక ప్రాజెక్టు కార్యాలయంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలతో పిల్లలకు వచ్చే సాధారణ వ్యాధుల నుంచి రక్షణ కలుగుతుందన్నారు. పిల్లల మెదడు చురుకుగా పని చేయడమే కాకుండా మధుమేహం వంటి సమస్యలు తొలగిపోతాయన్నారు. తల్లిపాల విశిష్టతను కార్యకర్తలు తల్లులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సుజాత, విజయ, తదితరులు పాల్గొన్నారు.
- రుద్రవరం: తల్లి పాలతో బిడ్డ ఆరోగ్యం పదింగా ఉంటుందని వైద్యాధికారి బాబు అన్నారు.తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని నర్సాపురం అంగన్‌వాడీ కేంద్రంలో పీహెచ్‌సీ వైద్య బృందం బాలింతలు, గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం

శిరివెళ్ల: 2025–26 విద్యా సంవత్సరానికి యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఆఫ్‌లైన్‌లో అడ్మిషన్ల ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ ఇంద్రావతి శుక్రవారం తెలిపారు. కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ, కెమిస్ట్రీ, కంప్యూటర్ కోర్సులున్నాయన్నారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన వారు వెంటనే తమ సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అడ్మిషన్ల ముగియగానే తరగతులు ప్రారంభమవుతాయన్నారు.

శిల్పానగర్‌లో చోరీ

నంద్యాల(అర్బన్): పట్టణ సమీపంలోని శిల్పానగర్‌లో నివాసముంటున్న సలాబీ ప్రేమక్క ఇంట్లో చోరీ జరిగింది. పింఛన్ డబ్బుల కోసం బనగానపల్లె వద్ద ఉన్న ఇల్లూరు కొత్తపేటకు వెళ్లగా దొంగలు ఇంట్లోకి చొరబడి రెండు జతల కమ్మలు, రూ.10 వేల నగదు, టీవీ చోరీ చేశారు. ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఈశ్వరయ్య తెలిపారు.

క్రీడాకారుడికి అభినందన


అర్షద్‌ను అభినందిస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల(న్యూటౌన్): పారా సైక్లింగ్‌లో అంతర్జాతీయ స్థాయిలో రాణించిన దివ్యాంగ క్రీడాకారుడు అర్షద్‌ను మంత్రి ఎన్ఎండీ ఫరూక్, నంద్యాల జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చిన్న వయస్సులోనే కాలు పోయినా క్రీడలపై మక్కుతో పారా సైక్లింగ్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి పతకాలు సాధించడం గొప్ప విషయమన్నారు.

పేదలకు సాయం చేయడంలోనే సంతృప్తి

నంద్యాల(న్యూటౌన్): పేదలకు సాయం చేయడంలోనే సంతృప్తి ఉంటుందని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. శుక్రవారం ఉదయం కలెక్టర్ నంద్యాల పట్టణంలోని 15 వ వార్డు గోపాల్ నగర్‌లో అవ్వాతాతలకు ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. అక్కడ నివసిస్తున్న 75 సంవత్సరాల ఒంటరి మహిళ తులసమ్మకు రూ.4వేలు పెన్షన్ అందజేస్తూ ఆమె దుస్థితిని అడిగి తెలుసుకొని చలించిపోయారు. సదరు మహిళను దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బంగారు కుటుంబాలను అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందజేస్తామన్నారు.

స్వాతి మహోత్సవం.. భక్తిపారవశ్యం


ఉత్సవంలో కొలువైన ఉత్సవమూర్తులు ,


సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఆళ్లగడ్డ: దిగువ అహోబిలంలో స్వాతి మహోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. తొలుత ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వాములను, అమృతవల్లి అమ్మవార్లను దేవాలయం ఎదురుగా యాగశాలలో కొలువుంచారు.

అభిషేకం, అర్చన, తిరుమంజనం అనంతరం ఉత్సవమూర్తులను అలంకరణ చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం అర్చకుల వేద మంత్రోచ్చారణలు, ఆస్థాన విద్వాంసుల మంగళ వాయిద్యాల మధ్య స్వాతి, సుదర్శన హోమాలు నిర్వహించి పూర్ణాహుతితో ముగించారు. రాత్రి విశేష పుష్పాలంకరణ చేసిన ఉత్సవ పల్లకీలో ఉభయ దేవేరులతో కొలువైన శ్రీ ప్రహ్లాదవరదుడు మాడ వీధుల్లో సంచరిస్తూ భక్తులకు కనువిందు చేశారు.

4 నుంచి విద్య, వైజ్ఞానిక శిక్షణ తరగతులు


పోస్టర్లు విడుదల చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 4 నుంచి మూడు రోజుల పాటు నంద్యాల పట్టణంలో పీడీఎస్‌యూ విద్య, వైజ్ఞానిక రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.భాస్కర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతుల వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 4వ తేదీన పద్మావతినగర్ ఆర్చి నుంచి రామకృష్ణ డిగ్రీ కళాశాల వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. 5, 6 తేదీల్లో జేకే ఫంక్షన్ హాల్‌లో ప్రతినిధుల సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యారంగం వ్యతిరేక విధానాలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు జునైద్ బాషా, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి రాంబాబు, నాయకులు సతీష్, మనోజ్, రమణ, కిరణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

లింగవివక్షను రూపుమాపాలి


మాట్లాడుతున్న ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ ప్రగతి

నంద్యాల(న్యూటౌన్): లింగవివక్షను రూపుమాపాలని ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ ప్రగతి అన్నారు. బాల్యవివాహాల నిర్మూలన, దేశ నిర్మాణంలో బాలిక విద్యాపాత్ర అనే అంశంపై శుక్రవారం బస్టాండ్ సమీపంలో ఉన్న బాలికల ఉన్నత పాఠశాలలో రామకృష్ణ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ మాట్లాడుతూ బాలికల భద్రత, ఆరోగ్యం, పరిశుభ్రత, బాలిక విద్యా ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి


మాట్లాడుతున్న పులికొండన్న


నంద్యాల(అర్బన్): వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే పునరుద్ధరణ తీర్మానాన్ని కేబినెట్‌లో ఆమోదించి కేంద్రానికి పంపాలని ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పులికొండన్న కోరారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా వాల్మీకులను వంచిస్తూనే ఉన్నారని, ఎన్నికల సమయంలో ఎస్టీ జాబితాలో చేరుస్తామంటూ ఉత్తుత్తి హామీలు ఇస్తూ వాల్మీకులను మోసం చేస్తున్నారన్నారు. గత ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు వాల్మీకులకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చి ఎస్టీలుగా పునరుద్ధరిస్తానని చెప్పారన్నారు.అయితే, ఇప్పటి వరకు ఆచరణలో పెట్టలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఓబులేసు, పరమేష్, మల్లికార్జున, మల్లి, ఈశ్వరయ్య, మధు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంపై పోరు


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ డోన్ పట్టణంలో జరిగిన సీపీఐ రెండో మహాసభల్లో ఎన్నికల హామీల అమలు కోసం సర్కారుపై పోరుకు కార్యచరణ రూపొందించినట్లు తెలిపారు. నంద్యాలలో వ్యవసాయ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, శ్రీశైలం రిజర్వాయర్ ముంపునకు గురైన వారికి 98 జీవో ప్రకారం ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిద్దేశ్వరం అలుగు నిర్మాణం చేపట్టి తీగల వంతెనకు బదులు బ్రిడ్జి కం బ్యారేజీని నిర్మించి రాయలసీమ ప్రాజెక్టులకు నికర జలాలు కేటాయించాలన్నారు. పోతిరెడ్డిపాడు నుంచి గోరుకల్లు రిజర్వాయర్ వరకు ఎస్సార్బీసీ వెంట స్లూయిస్‌లు ఏర్పాటు చేసి జిల్లా రైతాంగానికి సాగునీరు ఇవ్వాలన్నారు. ఓర్వకల్లు ఇండస్ట్రీయల్ కారిడార్‌లో యువతకు 80 శాతం ఉద్యోగాలు కల్పించాలన్నారు. జిల్లాలో ప్రతి పేదవాడికి పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణప్రాంతాల్లో మూడు సెంట్లు స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలన్నారు. ఇలాంటి అనేక అంశాలపై పోరాటాలు చేస్తామన్నారు. సమావేశంలో సీపీఐ సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి


విద్యార్థులకు మెమొంటో అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే మంచి మార్కులు సాధించవచ్చని బాను సొసైటీ వ్యవస్థాపకుడు రవికాంత్‌బాబు, హెచ్ఎం జీవలత పేర్కొన్నారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని ఎస్పీజీ పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులకు రూ.500 నగదు, ప్రశంసా పత్రం, మెమొంటోలు అందజేశారు. ఈ ఏడాది విద్యాసంవత్సరం కూడా పాఠశాల విద్యార్థులు పదవ తరగతిలో మంచి ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మల్లెల జ్యోతి, శెట్టి భాస్కర్, వరప్రసాద్, ప్రసాద్‌శర్మ, సాలేమ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

బనగానపల్లె రూరల్: మండలంలోని రాళ్లకొత్తూరు గ్రామ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగు నాయక్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల సమాచారం మేరకు వివరాలు.. సీతమ్మ తండాకు చెందిన నాగునాయక్ జీవాన్ని మోటార్ సైకిల్‌పై పెట్టుకొని బనగానపల్లె సంతకు బయలుదేరాడు. మార్గమధ్యలో రాళ్లకొత్తూరు సమీపంలో ఎదురుగా వచ్చిన లారీ మోటార్‌సైకిల్‌ను ఢీకొంది. ప్రమాదంలో నాగునాయక్ కాళ్లకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే బనగానపల్లె ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు కర్నూలుకు రెఫర్ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బనగానపల్లె పోలీసులు తెలిపారు.

కుందూనదిలో ఆటోడ్రైవర్ గల్లంతు?

బండిఆత్మకూరు: మండల కేంద్రానికి చెందిన ఆటో డ్రైవర్ ముర్తుజావలి హుసేన్ శుక్రవారం కుందూనదిలో గల్లంతైనట్లు సమాచారం. కుటుంబ సభ్యులు అతని కోసం విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోవడంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రం సమీపంలో సుమారు 30వేల క్యూసెక్కుల నీటితో కుందూనది ప్రవహిస్తోంది. ఈక్రమంలో మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఆటో డ్రైవర్ ముర్తుజావలి హుసేన్ తన ఆటోను శుభ్రం చేసుకునేందుకని నది వద్దకు వెళ్లాడు. రాత్రి తొమ్మిది గంటలైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు నది వద్దకు వెళ్లి చూడగా ఆటోలో దుస్తులు, సెల్‌ఫోన్ ఉన్నాయి. ప్రమాదవశాత్తూ నదిలో గల్లంతై ఉంటాడనే అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

సర్కారుపై నిరసన


మద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

చాగలమర్రి: రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై ఉపాధ్యాయులు కన్నెర్రజేస్తున్నారు. తాజాగా ఎంఈఓ–1 ఖాళీలను ప్రభుత్వ యాజమాన్య స్కూల్ అసిస్టెంట్లతో భర్తీ చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. శుక్రవారం పీఆర్‌టీయు ఆధ్వర్యంలో పాఠశాలల్లో మధ్యాహ్న భోజన సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. చాగలమర్రిలోని మద్దూరు ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు మౌళి బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఎంఈఓ-1 పోస్టులను ప్రభుత్వ యాజమాన్యంలో ఉన్న స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించి భర్తీ చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు హరినాథరెడ్డి, రవిశంకర్‌రెడ్డి, షరీఫ్, సురేష్‌బాబు, రాజ్‌కుమార్,ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

కలశ ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం


లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో హోమం చేస్తున్న భక్తులు

ఉయ్యాలవాడ: మండలంలోని ఇంజేడు గ్రామం లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం కలశ ప్రతిష్ఠోవ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. దాతల నుంచి గ్రామస్తులు రూ. 61 లక్షలు సేకరించి ఆలయ ముఖ ద్వారంపై రాజగోపురం(గాలిగోపురం) నూతనంగా నిర్మించారు. ఈ మేరకు వేద పండితులు పాణ్యం కృష్ణశర్మ ఆధ్వర్యంలో భాస్కరశర్మ, రవి శర్మ, అనంతయ్య, రమణయ్య, హరి శర్మ, శివప్రసాద్ శర్మ, వరప్రసాద్‌ల సమక్షంలో యాగశాలలో గణపతి పూజ, పుణ్యాహ వాచనం, రక్షా బంధనము, పంచగవ్య ప్రాసన, రుత్విక్ వర్ణం, జపాలు, మంత్ర పుష్పం, జలాధివాసం, అగ్నిముఖం, మహా మంగళ హారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు గజ్జెల క్రిష్ణారెడ్డి, గ్రామ వైఎస్ఆర్‌సీపీ నాయకులు కామిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, కర్రెపు చలపతిరెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ ఎస్ఐగా రామిరెడ్డి

ఉయ్యాలవాడ : ఉయ్యాలవాడ ఎస్ఐగా రామిరెడ్డిని నియమించారు. ఈమేరకు ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు 40 రోజుల క్రితం ఉమ్మడి కర్నూలు జిల్లా సీఐడీ కార్యాలయానికి బదిలీపై వెళ్లడంతో వీఆర్‌లో ఉన్న రామిరెడ్డిని ఇక్కడికి నియమించారు. రెండు మూడు రోజుల్లో నూతన ఎస్ఐ బాధ్యతలు చేపట్టనున్నట్లు పోలీసు సిబ్బంది తెలిపారు.